దరఖాస్తుల ఆహ్వానం

నాంపల్లి: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారిణి రోహిణి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణా తరగతులు మే 1 నుంచి జూన్ 13వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. నాంపల్లి ఆదాబ్ హోటల్ పక్కన ఉండే గాంధీభవన్ హైస్కూల్‌లో 42 రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. పదో తరగతి లేదా తత్సమాన పరీక్షతో పాటుగా లోయర్ గ్రేడ్ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పూరించిన దరఖాస్తులను గాంధీ భవన్ హైస్కూల్‌లో అందజేయాలని తెలిపారు.

లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి సంపూర్ణ మద్దతు


మాట్లాడుతున్న గొంటి కుమార్‌చౌదరి

సుల్తాన్‌బజార్: తెలంగాణలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమికి తమ పార్టీ సభ్యులందరూ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఏకగ్రీవంగా నిర్ణయించామని సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు గొంటి కుమార్‌చౌదరి ప్రకటించారు. బుధవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..బీజేపీ మతం పేరుతో రాజకీయాలు చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఎం.ఐలయ్య, చిట్టిబాబు, ఆర్.సత్యనారాయణ, ఆర్.యోగేశ్వర్‌రావు, అర్జున్, గోవింద్, వీరేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ విమానాశ్రయానికి నేరుగా ఆర్టీసీ బస్సులు

గోల్కొండ: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే పుష్పక్ బస్సులు నేటి నుంచి రూట్ మారనున్నాయి. ఈ వివరాలను బుధవారం మెహిదీపట్నం డిపో మేనేజర్ మూర్తి తెలిపారు. ప్రస్తుతం మెహిదీపట్నం నుంచి పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే మీదుగా వెళ్లే బస్సులు ఫ్లై ఓవర్ కింద ఉన్న రోడ్డు నుంచి రాకపోకలు సాగిస్తాయని ఆయన తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. మెహిదీపట్నం నుంచి వెజిటెబుల్ మార్కెట్, రేతిబౌలి, ఉప్పర్‌పల్లి, రాజేంద్రనగర్ ఎక్స్‌రోడ్, ఆరాంఘర్ నుంచి ఈ పుష్పక్ బస్సులు రాకపోకలు సాగిస్తాయి. మాసాబ్‌ట్యాంక్, విజయనగర్ కాలనీ, హుమాయున్‌నగర్, మెహిదీపట్నం, రేతిబౌలి, అత్తాపూర్, ఉప్పర్‌పల్లి, రాజేంద్రనగర్ క్రాస్ రోడ్ తదితర ప్రాంతాల నుంచి విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు దీన్ని వల్ల ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ పుష్పక్ బస్సు సౌకర్యం నేటి అర్ధరాత్రి నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. ప్రతి గంటకు ఒక పుష్పక్ బస్సు ఉంటుందని ఆయన తెలిపారు.

హైదరాబాద్‌లో బీజేపీ విజయం ఖాయం


కేంద్ర మంత్రిని సన్మానిస్తున్న యోగ్‌రాజ్‌సింగ్

గోల్కొండ: హైదరాబాద్‌లో ఈసారి బీజేపీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. బీజేవైఎం నగర కార్యదర్శి యోగ్‌రాజ్‌సింగ్ బుధవారం ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పార్టీ అభ్యర్థి కె.మాధవీలత భారీ మెజార్టీతో గెలిచేలా కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ప్రధాని మోదీ పదేళ్ల విజయాలను ప్రతి ఒక్క ఓటరుకు చేరేలా చూడాల్సిన బాధ్యత బీజేవైఎం నాయకులపై ఉందన్నారు.

సందడిగా గ్రాడ్యుయేషన్ డే


విద్యార్థులతో తిరుమల్ రెడ్డి, రామకృష్ణ యాదవ్

గౌలిపురా: అయోధ్యనగర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కె.తిరుమల్ రెడ్డి, జి.రామకృష్ణ యాదవ్ హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అలరించిన 'మట్టిమనిషి'


ఆకట్టుకున్న నాటకంలోని ఓ దృశ్యం

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాటకరంగ సంస్థ రసరంజని ఆధ్వర్యంలో రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి రచించిన 'మట్టిమనిషి' నాటకాన్ని బుధవారం రవీంద్రభారతిలో ప్రదర్శించారు. 1970 ప్రాంతంలో మట్టిమనిషి నవల ఎంతో ప్రాచుర్యం కలిగిందని, ఈ నవలను ఓయూఎంఏ ఫైనల్ విద్యార్థులకు పాఠ్యాంశంగా ఎంపిక చేసినట్లు పలువురు వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాటక దర్శకుడు నస్రిన్ ఇషాంక్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో గుర్తు తెలియని మహిళ మృతి



లంగర్‌హౌస్: వడదెబ్బతో గుర్తు తెలియని మహిళ మృతి మృతి చెందిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..లంగర్‌హౌస్ ఆర్మీ ఆస్పత్రి ఎదురుగా బాగ్దాది దర్గాలో మహిళ(45) పడి ఉంది. దర్గా నిర్వాహకుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా ఆమె అప్పటికే మృతి చెంది ఉంది. వడదెబ్బతో ఆమె మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. ఆమె వివరాల కోసం చుట్టుపక్కల వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో ఆమె మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్ అభివృద్ధికి కృషి చేస్తా

బీజేపీ అభ్యర్థి మాధవీలత


భాగ్యలక్ష్మి అమ్మవారికి బోనం సమర్పించేందుకు వెళ్తున్న మాధవీలత

చార్మినార్: తాను విజయం సాధిస్తే.. కులమతాలకు అతీతంగా హైదరాబాద్ అభివృద్ధికి కృషి చేస్తానని హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీలత హామీ ఇచ్చారు. ఏళ్ల తరబడి మతం పేరుతో రాజకీయాలు చేస్తూ అధికారం చెలాయిస్తున్న అసదుద్దీన్ ఒవైసీ ఇప్పటి వరకు ఎక్కడ అభివృద్ధి చేశారో చూపించాలని ఆమె సూటిగా ప్రశ్నించారు. బుధవారం తన నామినేషన్ దాఖలు సందర్భంగా చార్మినార్‌లో ఆమె సందడి చేశారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని సందర్శించారు. బీజేపీ శ్రేణులు చేతుల్లో జెండాలు పట్టుకుని పెద్ద ఎత్తున చార్మినార్‌కు చేరుకున్నారు. ముందుగా మాధవీలత తోటి మహిళా బీజేపీ నాయకురాళ్లతో కలిసి సామూహికంగా బోనాలతో చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహించారు. తన నామినేషన్ పత్రాలను అమ్మవారి పాదాల చెంత పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి చార్మినార్ నుంచి ర్యాలీగా బయలుదేరి వెళ్లి కలెక్టర్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను అందజేశారు. ఆమెతో పాటు చార్మినార్‌లో జరిగిన పూజా కార్యక్రమంలో అనురాగ్ ఠాకుర్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఆమె ప్రచార రథంపై నుంచి మాట్లాడుతూ.. పాతబస్తీలో దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలన్నింటినీ బాగు చేస్తానన్నారు. ఉద్యోగ అవకాశాలతో పాటు చక్కటి వైద్యం కనీస సౌకర్యాల కల్పన కోసం పాటుపడతానన్నారు. చార్మినార్ నుంచి నిర్వహించిన ర్యాలీ సందర్భంగా వాహనదారులకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా దక్షిణ మండలం ట్రాఫిక్ పోలీసులు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

దానం నాగేందర్ విజయానికి కృషి చేయాలి


సత్తి ప్రకాష్‌రెడ్డి

అబిడ్స్: న్యాయవాదులంతా సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ విజయానికి కృషి చేయాలని తెలంగాణ కంగ్రెస్ కమిటీ లీగల్ హ్యూమన్‌రైట్స్, ఆర్‌టీఐ డిపార్ట్‌మెంట్, వైస్ చైర్మన్, ప్రముఖ న్యాయవాది సత్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గోషామహల్ నుంచి పెద్ద ఎత్తున న్యాయవాదులు కార్యకర్తలు, నాయకులతో కలిసి దానం నాగేందర్ నామినేషన్‌కు సత్తి ప్రకాష్‌రెడ్డి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో ఒక్కో న్యాయవాది తన తరఫున వంద మందిచే దానం నాగేందర్‌కు ఓటు వేయించాలన్నారు. గత ఐదేళ్లుగా బీజేపీ ఎంపీ కిషన్‌రెడ్డి ప్రజలకు ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఎన్నికలప్పుడే ప్రజల ముందుకు వచ్చిన కిషన్‌రెడ్డిని చిత్తుగా ఓడించాలన్నారు. దానం నాగేందర్‌ను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాభివృద్ధి చేస్తారని ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌తోనే ప్రజాభివృద్ధి



అబిడ్స్: బీఆర్ఎస్‌తోనే ప్రజాభివృద్ధి కొనసాగుతుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశిష్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఎన్నికలు ఉన్నా, లేకున్నా ప్రజల పక్షనే ఉంటూ ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. బీఆర్ఎస్ భవన్ నుంచి కేసీఆర్ ప్రారంభించిన బస్సు యాత్రకు ఆశిష్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో గోషామహల్ నుంచి భారీ ఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. ఆశిష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను అన్నివిధాల మోసం చేస్తుందన్నారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో అత్యధిక స్థానాలు బీఆర్ఎస్‌వే అన్నారు.

'కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతాం'

గన్‌ఫౌండ్రీ: సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు చేస్తున్న అన్యాయంపై త్వరలో మాదిగల ఆత్మగౌరవ బస్సు యాత్రను నిర్వహిస్తున్నట్లు మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు టి.నవీన్‌రాజ్ తెలిపారు. మాదిగలపై జరుగుతున్న కుట్రను నిరసిస్తూ బుధవారం మాదిగ రాజ్యాధికార పోరాట సమితి ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి గన్‌పార్కు వరకు నిరసన ర్యాలీని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మాదిగలకు ఒక్క టికెట్ కూడా కేటాయించని కాంగ్రెస్ పార్టీకి ఓటు రూపంలో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర


శోభాయాత్రలో దక్షిణ మండలం అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్ తదితరులు

గౌలిపురా: హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం రాత్రి నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర వైభవంగా కొనసాగింది. మంగళవారం రాత్రి గౌలిపురాలోని హనుమాన్ ఆలయంలో మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హనుమాన్ శోభాయాత్రను ప్రారంభించారు. ఈ శోభాయాత్ర గౌలిపురా మార్కెట్, సుల్తాన్‌షాహీ, ఉప్పుగూడ, హనుమాన్‌నగర్ మంగళ్‌ముఖి ఆలయం, ఛత్రినాక, లాల్‌దర్వాజా మోడ్, శాలిబండ రాజేశ్ మెడికల్ హాల్, అక్కన్న మాదన్న ఆలయం, బేలా చౌరస్తా, మీర్‌కా దయారా మీదుగా తిరిగి ఆలయం వరకు కొనసాగింది. దక్షిణ మండలం అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్, ఛత్రినాక ఏసీపీ సీహెచ్.చంద్రశేఖర్, మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గాప్రసాద్, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ శ్రీను, ఓబీసీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆలె భాస్కర్ రాజ్, గౌలిపురా కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. శోభాయాత్రను పురస్కరించుకొని మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

తగ్గని పర్యాటకుల రద్దీ


చార్మినార్ వద్ద సందర్శకుల సందడి

చార్మినార్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన పాతబస్తీలో పర్యాటకుల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. మండే ఎండలను సైతం లెక్కచేయని పర్యాటకులు చార్మినార్, మక్కా మసీదుతో పాటు సాలార్‌జంగ్ మ్యూజియం, హెచ్‌ఈహెచ్ నిజాం మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్,జూ పార్కులను సందర్శించడానికి పర్యాటకులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. పాతబస్తీలోని మ్యూజియంలను సందర్శించడానికి సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని తగిన ఏర్పాట్లు చేస్తుండడంతో ఆదరణ పెరుగుతోంది. ప్రైవేటు వాహనాలతో పాటు సొంత వాహనాల్లో పాతబస్తీలోని మ్యూజియంలను సందర్శించడానికి క్యూ కడుతున్నారు. వీకెండ్‌లో సందర్శకుల సంఖ్య మరీ రెట్టింపు అవుతోంది. దీంతో పాత నగరంలోని పర్యాటక ప్రాంతాల వద్ద స్థానిక వ్యాపారులకు సైతం గిరాకీ పెరిగింది.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ పల్లకీ సేవ


హనుమాన్ పల్లకీ సేవలో పాల్గొన్న గాజుల అంజయ్య తదితరులు

చార్మినార్: పాతబస్తీలో ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గాజుల అంజయ్య అన్నారు. మీరాలంమండిలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారు జాము వరకు హనుమంతుని పల్లకీ సేవ ఊరేగింపు భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతబస్తీలో ఇరువర్గాల ఉత్సవాలు కలిసిమెలిసి నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

బీజేపీకి రాష్ట్ర కురుమ సంఘాల మద్దతు


ఈటల రాజేందర్‌తో మాట్లాడుతున్న దేవర శ్రీనివాస్

గోల్కొండ: తెలంగాణ రాష్ట్ర కురుమ సోదరుల మద్దతు బీజేపీకి ఉందని కురుమ సంఘం రాష్ట్ర నాయకుడు, సీనియర్ బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. కురుమ సంఘం రాష్ట్ర మహాసభల ఏర్పాటుపై బుధవారం ఆయన బీజేపీ నాయకులు ఈటల రాజేందర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ ఆయనకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాల్లో కురుమ సంఘాల మహాసభలు నిర్వహించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ప్రధాని మోదీ కురుమ సోదరులకు ఆదుకుంటారన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీ కులాల కోసం చేపడుతున్న సంక్షేమ పథకాల వల్ల వేలాది కురుమ సోదరులకు లబ్ధి చేకూరుతుందన్నారు.

సన్మానం


అమర్‌సింగ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధిక స్థానాలు గెలిచి సత్తా చాటుతుందని కార్వాన్ బీజేపీ ఇన్‌చార్జి ఠాకూర్ అమర్‌సింగ్ అన్నారు. హనుమాన్ జయంతి ఉత్సవాలు, బైక్ ర్యాలీలు, శోభాయాత్రలు విజయవంతంగా ముగిసిన సందర్భంగా బుధవారం గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఠాకూర్ అమర్‌సింగ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వ లక్షణాలను ప్రపంచ దేశాలన్ని ప్రశంసిస్తున్నాయన్నారు. శాస్త్రసాంకేతిక రంగాలతో పాటు ఆర్థికంగా కూడా దేశాన్ని అగ్రరాజ్యంగా తీర్చిదిద్దుతున్న ప్రధాని మోదీను మరోసారి ప్రధాని చేయడానికి ప్రతి ఒక్కరూ బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.

సత్తాచాటిన ఇంటర్ విద్యార్థులు


ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో డైరెక్టర్ అక్రమ్ అలీ

గోల్కొండ: ఇంటర్ ఫలితాల్లో తమ కళాశాల గతంలో కంటే మెరుగైన ఫలితాలు సాధించిందని గోల్కొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.మాధవి తెలిపారు. రెండో సంవత్సరం మొత్తం 369 మంది బాలికలు పరీక్షలు రాయగా 231 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అదే విధంగా ప్రథమ సంవత్సరంలో మొత్తం 529 మంది బాలికలు పరీక్షలు రాయగా 234 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీకి చెందిన సనాబేగం (959/1000) సాధించి కళాశాల టాపర్‌గా నిలిచిందని, బైపీసీకి చెందిన మహీన్‌సుల్తానా (947/1000) మార్కులు, సీఈసీకి చెందిన జుసేరాఫాతిమా(931/1000) మార్కులు సాధించిందని ఆమె పేర్కొన్నారు.

గన్‌ఫౌండ్రీలో..

గన్‌ఫౌండ్రీ: ఇంటర్ ఫలితాల్లో గన్‌ఫౌండ్రీలోని మహబూబియా బాలికల కళాశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. కళాశాల ప్రిన్సిపాల్ సుహాసిని వివరాలను వెల్లడించారు. మొదటి సంవత్సరంలో బైపీసీకి చెందిన ఎం.వర్షిణి 431 మార్కులను సాధించిందన్నారు. అదేవిధంగా ఎంపీసీకి చెందిన కె.దివ్య 452, హెచ్‌ఈసీకి చెందిన ఎల్.ఖజియా 485 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీకి చెందిన జి.గీత 963 మార్కులు, కె.కవిత 948 మార్కులను సాధించినట్లు తెలిపారు. కళాశాలలో దాదాపు 25 మంది విద్యార్థులు 90 శాతానికి పైగా మార్కులను సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు.

అక్షదీప్ జూనియర్ కళాశాలలో..

జియాగూడ: అక్షదీప్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ ఫలితాల్లో 92 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినందుకు కళాశాల ఆడిటోరియంలో అక్షదీప్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్ మహ్మద్ అక్రమ్‌అలీ, అకాడమిక్ డీన్ పి.సుజాత విద్యార్థులకు అభినందించారు. మొదటి సంవత్సరం బైపీసీ విద్యార్థులు చౌహాన్ మేఘన, ఆస్పియా తాజీన్, హప్సానాజ్, సోఫియాభేగం, నిషత్ తహనియత్, ఎంపీసీలో దివ్యడాలియా, ఎంఈసీలో ప్రతిభ ఓట్కర్, కథక్‌షా, మహ్మద్ ఖాజా నవాజుద్దీన్, సీఈసీలో ఎం.ప్రతిభానుదాస్, గూడు మణి సుధాంషిక, ప్రియాంకపటేల్, ద్వితీయ సంవత్సరంలో పి.రిదిమారెడ్డి ఎంపీసీ 969, బైపీసీలో జైబానాజ్ 968, పరహాన నుస్రత్ 949, సీఈసీలో సునైనా సింగ్ 969 తదితరులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మెహిదీపట్నం అక్షదీప్ కళాశాల ప్రిన్సిపాల్ విశాల్ సింగ్, జియాగూడ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ అబ్దుల్ తవాబ్ పాల్గొన్నారు.

మజ్లిస్ పేద ప్రజల పార్టీ: ఎమ్మెల్యే కౌసర్


అక్బర్‌బాగ్‌లో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నజీబ్

గోల్కొండ: మజ్లిస్ పేద ప్రజల పార్టీలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం టోలిచౌకీ డివిజన్‌లోని బస్తీలు, కాలనీల్లో ఇంటింటికీ తిరిగి మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మజ్లిస్ నాయకులతో కలిసి మజ్లిస్ ఎన్నికల గుర్తు కరపత్రాలను పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో నేడు ప్రతి ఇంటికీ తాగునీరు అందుతుందని, దీనికి మజ్లిస్ పార్టీ చేసిన కృషి కారణమన్నారు. తాను పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉంటున్నానని ఈ కాలంలో దళిత బస్తీల అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. ప్రజల వెంట ఉండి వారి సమస్యలను పరిష్కరించే వ్యక్తి అసదుద్దీన్ ఒవైసీ అని ఆయనకు మరోసారి ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా ఆయనకు తెలంగాణ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అక్బర్‌బాగ్‌లోని తన కార్యాలయంలో సన్మానించారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్, ఖాలేద్ అలీఖాన్, గౌస్‌భాయ్, వజీఉజ్‌జమా తదితరులున్నారు.

హైదరాబాద్‌లో రికార్డు సృష్టిస్తా: శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: హైదరాబాద్ నియోజకవర్గంలో విజయం సాధించి రికార్డు సృష్టిస్తానని హైదరాబాద్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం గౌలిగూడ విఠోభ ఆలయంలో నుంచి భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్, బీజేపీలు మతం పేరు చెప్పి ఓట్లు దండుకుంటారే తప్పా ఎలాంటి అభివృద్ధి చేయరన్నారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. పాతబస్తీలో గత పదేళ్లలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం వందల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. ఎన్నికలప్పుడే ప్రజల వద్దకు వచ్చే మజ్లిస్, బీజేపీలను చిత్తుగా ఓడించాలన్నారు.

'బీజేపీ, బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడిస్తాం'


దానం నాగేందర్‌కు సంఘీభావం తెలిపిన నిర్మల్‌కుమార్ యాదవ్

అబిడ్స్: ఈ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లను చిత్తుగా ఓడిస్తామని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ జాయింట్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం గోషామహల్ నుంచి సికింద్రాబాద్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి నిర్మల్‌కుమార్ యాదవ్ నాగేందర్‌కు సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ... బీజేపీ, బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమం, ప్రగతి, అభివృద్ధితోనే దానం నాగేందర్ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

అయోమయంలో కార్వాన్ కాంగ్రెస్ నాయకులు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో హైదరాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై అయోమయం నెలకొని ఉంది. ఓ వైపు మజ్లిస్, మరోవైపు బీజేపీ ఎన్నికల ప్రచారంలో బిజీబిజీగా ఉంది. మరోవైపు కాంగ్రెస్ అధిష్టానం తమ అభ్యర్థిగా సమీఉల్లాను ప్రకటించింది. అయితే సమీఉల్లా ఎవరో తమకు తెలియదని కార్వాన్‌లోని సీనియర్ కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. మజ్లిస్‌కు పరోక్షంగా తమ పార్టీ మద్దతు తెలుపుతున్న విషయం తమకు తెలుసని అయితే అభ్యర్థి ప్రకటనపై తామంతా అయోమయంగా ఉన్నామని పలువురు సీనియర్ నాయకులు అంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో నయం అనిపించుకున్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు ఎన్నికల్లో మాత్రం చతకీల పడడం ఖాయమని పలువురు అంటున్నారు.